# పంచదార చిలుక

ఉషోదయమయింది. పుత్తడి వెలుగుచూసిపట్నం కళ్ళు చిట్లిచ్చుకుంది. రాత్రి అంటగట్టిన నాగరికతా "హేంగోవర్‌ని విదిల్చుకుని బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంది పట్నం.'

ఎర్రబడిన కళ్ళను చేత్తో రుద్దకున్నాడు సందీప్. రాత్రంతా నిద్రలేదు. నిద్రపోవాలని ప్రయత్నించినా నిద్ర పట్టదతనికి రోజూ ఇదే తంతు.

తెల్లారేవరకూ బాల్కనీలోనే కూర్చుని కాలక్షేపం చేశాడు. ఖాళీఅయిన విస్కీ బాటిల్‌ను చూసి నవ్వుకున్నాడు.

'నా మనస్సు నీకు ఒక్కడికే తెలుసు నేస్తం' ప్రేమగా విస్కీబాటిల్ నిమురుతూ అనుకున్నాడు.

సూర్యకిరణాలు సూదుల్లా కళ్ళల్లో గుచ్చుకోవడంతో బాల్కనీలో కూర్చోలేక గదిలోకి వచ్చేశాను.

ఏ.సి.రూము చల్లదనం అతన్ని చుట్టుముట్టినా తలలో అగ్నిపర్వతం మండిపోతున్నట్లు అన్పించింది.

ఎదురుగా గోడమీది తైలవర్ణచిత్రం కేసి చూశాడు.

...ఓ అద్భుత సౌందర్యరాశి తన కౌగిట్లోకి రమ్మని వెన్నెలదొరని పిలుస్తున్న దృశ్యం.

ఎన్నిసార్లు చూసినా మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తుంది ఆ చిత్రాన్ని.

హాయిగా నిద్రపోవాలి... కమ్మటి కల గనాలి. ఆ కలలో ఆ అద్భుత సౌందర్య రాశి ప్రత్యక్షమవ్వాలి. అపురూప సౌందర్య రాశి నడుంచుట్టూ చెయ్యి బిగించి, ఆమె ఎత్తైన ఎద ఒత్తిడిలో నలిగిపోవాలి. ఆ అమ్మాయి వరూధినా?

ప్రవరాఖ్యుడికి వరూధిని పట్నంలో ఎందుకు కన్పించలేదు? హిమాలయాల్లోని కొండల్లో, కోనల్లో ఎందుకు కన్పించింది. ఎన్నో సౌకర్యాలున్న నగరాల్లో వుండక అందగత్తెలు,

ఋషిపుంగవులు అడవుల్లో, కొండల్లో, కోనల్లో ఎందుకున్నారు? ప్రశాంతంగా, నిర్మలంగా వుండగలిగేది అక్కడేగా!

టెలిఫోన్ మ్రోగడంతో అతని ఆలోచనలు తెగిపోయాయి. రిసీవర్ అందుకున్నాడు సందీప్.

"హలో"

"గుడ్‌మార్నింగ్ సందీప్"

స్నిగ్ధ గొంతు గుర్తుపట్టాడు. రాత్రి అనుభవం కళ్లలో మెదిలింది. పెర్‌ఫ్యూమ్ వాసనలు వెదజల్లుతూ స్నిగ్ధ ఆహ్వానించింది వాళ్ళింట్లో...

మందు బిగించి మంచంమీద చేరాడు. గువ్వపిట్టలా తన కౌగిలిలో ఒదిగిపోయింది. తేనెరంగులో వున్న ఆమె శరీర పొంగులను నిమురుతూ వుంటే ఉద్రేకం కట్టలు తెంచుకుంది.

"డియర్ నా బ్యాంక్ బ్యాలెన్స్ పూర్తిగా 'నిల్' అయ్యింది. ఓ పదివేలకు చెక్ రాసివ్వు' ' అంది స్నిగ్ధ.

పాలపొంగుమీద చన్నీళ్ళు చల్లినట్లయ్యింది. అదే తనకు నచ్చనిది... కార్లు వున్నాయి, షేర్లు వున్నాయి తనకు. బిల్డింగ్‌లున్నాయి. బోల్డెన్ని బిజినెస్‌లు వున్నాయి. అయితే అందరికీ తన సంపద మీద దృష్టేగాని తను అవసరంలేదు. మనస్సువిప్పి మాట్లాడే మనిషి తటస్థపడలేదు తనకు.

"ఐదు నిముషాల నుండి ఫోన్లో గొంతు చించుకుని మాట్లాడుతున్నాను. నువ్వే మిటి మాట్లాడవ్?" ఫోనులో అతలవైపు నుంచి అరిచింది స్నిగ్ధ.

"ఏం మాట్లాడమంటావ్?"

"రాత్రి చెప్పా పెట్టకుండా ఉడాయించేవ్ ఎందుకు?"

"నువ్వు డబ్బు ఎందుకు అడిగావ్?"

"నీ అవసరాలకు నన్ను వాడుకుంటున్నప్పుడు నా అవసరాలు నువ్వు గమనించవొద్దా" అందామె.

"నా డబ్బేగాని నా మనస్సు గమనించరు"

"నీ సంగతి నీ గర్ల్‌ఫ్రెండ్స్ అంధరికీ తెలుసు. నీలో ధీరత్వం లేదు, మర్యాదలేదు, నొబిలిటీ లేదు, పిచ్చి పిచ్చి పనులన్నీ చేస్తావ్. రాత్రిసంగతి మర్చిపోయావా? నేను బాత్‌రూమ్‌లోకి

వెళ్ళగానే గడియ పెట్టేసి నీ దారిన నువ్వు చెప్పాపెట్టకుండా వెళ్ళావ్. తలుపు తీసుకుని బాత్‌రూమ్‌నుండి బయటపడటానికి తల ప్రాణం తోకకు వచ్చింది నాకు" అంది స్నిగ్ధ విసుగ్గా ఫోన్ పెట్టేశాడు సందీప్.

వేరొకరు తన తప్పులు వేలెత్తి చూపితే కోపం అతనికి. మేడమెట్లు దిగి క్రింది హాల్లోకి వచ్చాడు. సందీప్. డైనింగ్ టేబిల్ ముందు కూర్చున్నాడు.

ప్లేటులో వేడి వేడి ఇడ్లీ పెట్టబోయింది కామేశ్వరమ్మ.

"టిఫిన్ వద్దమ్మా! కాఫీ ఇవ్వు చాలు" అన్నాడు సందీప్.

"టిఫిన్, అన్నం మానేసి బ్రాందీ, విస్కీలు తాగు. రాత్రుళ్ళు అమ్మాయిలతో తిరుగు. ఎప్పుడు బాగు పడతావో ఏమిటో?" కోపంతో ఊగిపోతూ అంది.

"మమ్మీ కాఫీ ఇస్తావా? బయట రెస్టారెంటులో తాగమంటావా?" కుర్చీలో నుంచి లేవబోతూ అన్నాడతను.

"కాల్చుకుతింటున్నావురా నన్ను. మీ నాన్నగారు అదృష్టవంతులు. కొడుకు చెడుతిరుగుల్ళు చూస్తూ ఈ భూమిమీదే వుండమని నాకు చెప్పి, ఆయన పై లోకానికెళ్ళిపోయారు. నీకేమో పూర్తిగా మీ మేనమామ పోలికలు వచ్చాయి. తాగి తందనాలాడి, అమ్మాయిలతో తిరిగి ఆస్తి అంతా హారతి కర్పూరంలా వెలిగించి మంగళంపాడి పైకి వెళ్ళిపోయాడు" అంది కామేశ్వరమ్మ ముక్కు చీదుకుంటూ.

"మామయ్య పెళ్ళి చేసుకోలేదా?"

సందీప్‌కి మేనమామంటే ఆరాధనాభావం. దయానందం మామయ్య సంగతులు వినాలంటే ఇష్టపడతాడు.

"పెళ్ళి ఒకటే తక్కువ వాడికి. చివరకు వుండటానికి ఇల్లుకూడా లేక తాతయ్య నాకిచ్చిన ఇంట్లోనే వుండేవాడు. ఉంచుకున్నదాన్ని ఆ ఇంట్లోనే పెట్టాడు. దానికో కూతురనుకుంటా!"

"మామయ్య చనిపోయి ఆరేళ్ళయ్యింది కదమ్మా! తాతయ్య నీకిచ్చిన పొలం, ఇల్లు మామయ్య వుంచుకున్నదాని స్వాధీనంలోనే వున్నాయా?"

"వాళ్ళ గొడవ మనకెందుకులేరా... నువ్వు కాఫీ తాగు" అందామె కాఫీకప్పు అందిస్తూ.

"ఈ రోజే నేను తాతయ్యగారి ఊరు వెళ్తున్నా నమ్మా! మన పొలం, ఇల్లు అమ్మేసి వస్తాను"

"పదితరాలకు సరిపడా ఆస్తి వుంది మనకు. అక్కడి పొలం, ఇల్లు అమ్మడం ఎందుకు? వాళ్ళ బ్రతుకేదో వాళ్ళను బ్రతకనీ" అంది కామేశ్వరమ్మ.

తల్లిమాటలు విన్పించుకోలేదు.

సూట్‌కేస్‌లో బట్టలు సర్దమని పనిమనిషికి చెప్పి బాత్‌రూమ్‌కేసి నడిచాడు సందీప్.

'వీడు ఉత్త తిక్క మనిషి. ఏది తోస్తే ఆ పని చెయ్యడమే' నిట్టూర్పు విడుస్తూ అనుకుందామె.

స్టేషన్‌నుంచి రిక్షా ఎక్కకుండాడొంకదారి పట్టాడు సందీప్. ఎటుచూసినా పచ్చటి పొలాలు, డొంకమీద దట్టంగా చెట్లు, పక్షుల కిలకిలారావాలు, శరీరాన్ని మృదువుగా స్పృశించే చల్లటి గాలి.

అతనితో పాటే నడుస్తున్న వ్యక్తికి సందీప్ దయానందంగారి మేనల్లుడని తెలియడంతో, దయానందం గూర్చి తనకు తెలిసినదంతా చెప్పుకుపోసాగేడు.

"మీ మామయ్య చెట్టంత మనిషి. దబ్బపండు ఛాయలో పట్టుకుంటే మాసిపోయేటట్లు వుండేవాడు. మడత నలగని సిల్కుచొక్కా, తెల్లటి ధోవతి, భుజం పైన జరీ అంచు ఉత్తరీయం, ఎంత దర్పంగా వుండే వాడు! తనకున్నది నలుగురికి పంచిపెట్టాడేగాని ఇతరుల సొమ్ముకు ఆశపడేవాడుకాదు. నాటకాల పిచ్చిలో పడి దేశమంతా తిరుగుతూ వుండేవాడు. ఆయన భార్య కూడా సాత్వికురాలేనబ్బాయ్. నోట్లో నాలుక లేని మనిషి"

దయానందం మామయ్యను పొగడటం నచ్చిందే గాని, ఆయన ఉంచుకున్న మనిషిని పొగడటం నచ్చలేదు సందీప్‌కు.

"మామయ్యకు పెళ్ళి కాలేదుగా?"

"పెళ్ళి కాకపోతేనేమిటి? చివరి రోజుల్లో మీ మామయ్యకు ఆవిడ చేసిన సేవలు కట్టుకున్న భార్య కూడా చేయదంటే నమ్ము. మీ మామయ్యని దేవుడిలా కొలుచుకునే ఆమెను 'వుంచుకున్న'దని అనడానికి మనస్సు వొప్పదబ్బాయ్".

అతని మాటలు రుచించలేదు సందీప్‌కు.

"దానికో కూతురు వుందటగా" అన్నాడు సందీప్.

"నీ మేనమామ కూతురు చక్కని చుక్క. కాలేజీ చదువు కూడా పూర్తిచేసింది. ఊళ్ళో పిల్లలకి పాఠాలు చెబుతుంది".

ఊళ్ళోకి వచ్చేక దయానందం ఇల్లు చూపించి వెళ్ళిపోయాడాయన.

మండువాలోగిలి ఇల్లు, ఇంటిచుట్టూ పెద్ద ప్రహారీ గొడ. ఇంటి చుట్టూ వున్న విశాలమై ఆవరణలో రకరకాల చెట్లు, ఇంటిముందు పూలచెట్లు.

చెక్కగేటు తోసుకుని ఊల మొక్కల మధ్యగుండా ఇంటివైపు నడుస్తూవుంటే కమ్మటి పరిమళం అతన్ని చుట్టుముట్టేసి ఆహ్వానం పలికినట్లనిపించింది.

ఇంటి గుమ్మం దగ్గర ఎదురొచ్చిన అమ్మాయిని చూసి మెలికలు తిరిగిపోయాడు సందీప్.

కాగితప్పూలను చూసిన కళ్ళకు మంచ మిసమిసలాడే ఎర్రగులాబీ కనిపిస్తే కళ్ళు చెదిరిపోవూ !

' ఈ గులాబీరేకులను ఓ సారి తడిమి, వాసన చూసి గాని ఇక్కడ నుంచి కదలకూడదు' అనుకున్నాడు సందీప్ మనస్సులో.

"ఎవరుకావాలి?" వచ్చిన దెవరో తెలియక అడిగిందా అమ్మాయి.

ఆ అమ్మాయికేసి చూస్తూ వుండిపోయాడు. మెరుపు తీగను చూస్తున్నట్లుగావుంది.

పసుపుపచ్చ రంగు చీరపై ఆకుపచ్చ పువ్వుల డిజైన్, నల్ల జాకెట్టుపై తెల్లటి ఎంబ్రాయిడరీ పూలు, తలనిండా కనకాంబరాల పూలదండతో వనలక్ష్మిలా కనిపించింది.

తన గదిలోని తైలవర్ణ చిత్రంలోని సౌందర్యరాశి భువికి దిగి రాలేదుకదా!

అందాన్నికొలిచే మీటరు వుంటే పై అంచుకు చూపిస్తుందేమో!

"దయానందంగారి మేనల్లుడిని... నా పేరు సందీప్" వచ్చినదేవరానని కూతురు వెనుక నిలబడి చూస్తున్న అన్నపూర్ణమ్మకి సందీప్‌లో దయానందంగారి పోలికలు కొట్టొచ్చినట్లు కన్పించేయి.

"గుమ్మం దగ్గరే నిలబెట్టేశావేమిటే... లోపలికి రాబాబూ" భుజం చుట్టూ చీరకొంగు కప్పుకొని లోపలికి నడుస్తూ అంది అన్నపూర్ణమ్మ.

మండువా మెట్లమీద కాళ్ళు కడుక్కుని లోపలి గదిలోకి వచ్చేడు సందీప్.

చామంతి పూలదండ వేసివున్న మామయ్య ఫోటో కనిపించింది. నాటకల పోటీల్లో మామయ్య గెలుచుకున్న కప్పులు, షీల్డులు అందంగా అమర్చబడి వున్నాయి.

అగరొత్తుల పరిమళం అతని ముక్కుపుటాలకు సోకింది. మామయ్యంటే వీళ్ళకు, గౌరవం, భక్తిశ్రద్ధలున్నాయనుకున్నాడు మనస్సులో.

కాఫీ కప్పుతో ప్రత్యక్షమయ్యింది గుమ్మం దగ్గర ఎదురైన మెరుపుతీగె.

"నీ పేరేమిటి?" చొరవగా అడిగేడు సందీప్. "సుప్రజ" అందా అమ్మాయి అతనివైపు సూటిగా చూడలేక కంటి రెప్పలు వాల్చుతూ.

కాఫీతాగి కప్పు తిరిగి ఇచ్చేస్తూ ఆమె చేతివేళ్ళు తాకాలని ప్రయత్నించేడుగాని, ఆ అమ్మాయి అతి లాఘవంగా కప్పు అందుకునేసరికి అతని ప్రయత్నం విఫలమయ్యింది.

సుప్రజ చిరునవ్వు నవ్వింది.

తన ప్రయత్నం ఆ అమ్మాయి తెలుసుకుందనుకున్నాడు సందీప్.

"ఎంత వరకు చదువుకున్నావ్?" దర్పంగా అడిగేడు.

"బి.ఏ. పూర్తిచేవాను"

"పట్నం వొచ్చేస్తావా... ఉద్యోగం ఇప్పిస్తాను".

"అవసరం లేదండీ, మా నాన్నగారికి ఈ ఊరంటే పంచప్రాణాలు. నాక్కూడా ఈ ఊళ్ళోనే వుండిపోయి పిల్లలకు పాఠాలు చెబుతూ, రాత్రిపూట పెద్దలకు అక్షరాలు నేర్పాలని వుంది."

"నీలాంటి అందమైన అమ్మాయి నేర్పితే నా క్కూడా నేర్చుకోవాలని వుంది" అన్నాడు. సందీప్ చిలిపిగా.

ఆ అమ్మాయికి కోపం వస్తుందేమోననుకున్నాడు.

"మేనత్త కొడుక్కి నేర్పకుండా వుంటానా?" అందామె ముసిముసినవ్వులు నవ్వుతూ.

సుప్రజ తనను మేనత్త కొడుకని సంబోధించడం సందీప్‌కు సుతారామూ నచ్చలేదు.

'వీళ్ళకు కొంచెం సందిస్తే నెత్తిమీదకు ఎక్కుతారు. దూరంగానే వీళ్ళను వుంచడం మంచిది. తాను వచ్చిన పని పూర్తి చేసుకుని వెళ్ళిపోతే మంచిది' అనుకున్నాడతను మనస్సులో.

"ఇల్లు, పొలం అమ్మేద్దామనుకుంటున్నాను" అన్న పూర్ణమ్మగారికూడా వినబడేట్లు పెద్దగా అన్నాడు సందీప్.

"నీ ఇష్టం బాబూ... నువ్వు ఎప్పుడు ఖాళీ చెయ్యమంటే అప్పుడు వెళ్ళిపోతాం. చనిపోయేముందు మీ మామయ్య ఓ కోరిక కోరాడుబాబూ! మన సంప్రదాయ నృత్యరీతులు కనుమరుగవుతున్నాయి. సంగీత, నృత్యాలను ఆదరించాలి. ఈ ఇంట్లో నృత్య, సంగీత, నృత్యాబిను ఆదరించాలి. ఈ ఇంట్లో నృత్య, సంగీత పాఠశాలను ఏర్పాటు చెయ్యమని కోరాడయ్యా. ఆ పని నీవల్లే అవుతుంది" అంది అన్నపూర్ణమ్మ.

ఇల్లు ఖాళీ చేస్తామని అన్నపూర్ణమ్మ గారనడం సందీప్‌కు సంతోషాన్ని కలిగించింది. తల్లీ కూతుళ్ళు పేచీలు పెడతారేమోననుకున్నాడు అంతకుముందు.

'తల్లీకూతుళ్ళు మంచివాళ్ళే' మనస్సులో మొదటి సారి అనుకున్నాడతను.

భోజనం వడ్డించింది అన్నపూర్ణమ్మ.

గోంగూరపచ్చడి, బీరకాయ పాలకూర, ఉలవచారు రుచి చూడగానే ప్రాణం లేచివచ్చిందతనికి.

పీటమీద కూర్చుని భోజనం చెయ్యడం ఇబ్బంది అనిపించినా, సుప్రజ కూరలు, నెయ్యి వడ్డించేటప్పుడు వెన్నముద్దల్లా మెరిసిపోతూ కన్పించిన ఆమె వక్షోజాలు చేసి మై మరచి పోయాడతను. లొట్టలు వేసుకుంటూ అన్నం తిన్నాడు.

వేడి నీళ్ళ స్నానం, కమ్మటి భోజనం, పడుకోబోయే ముందు గ్లాసు పాలు, సుప్రజ వక్కపొడి అందివ్వడం - ఇవన్నీ అతని మనస్సుకు తృప్తి కలిగివచేయి. తృప్తి పడిన మనస్సు గాఢంగా నిద్రలోకి జారుకుంది. ఎన్నోరోజుల తరువాత గాఢంగా నిద్రపోయాడు! మరుసటి రోజు ఉదయాన్నే లేచిన అతనికే ఆశ్చర్యమేసింది.

మందుకొట్టలేదు, మాత్రలు వేసుకోలేదు మరి నిద్ర ఎలా పట్టింది?

ఓ మగువ మార్చివేస్తున్నట్లున్నదే తన జీవన రూపురేఖల్ని.

పెరట్లో బావి దగ్గర మొలచుట్టూ తుండు చుట్టుకుని స్నానంచేశాడు. ఆరుబయట ఒంటి మీద ఎండపడి శరీరం వింతగా మెరుస్తుంటే, చల్లటి నీళ్ళు ఒంటిమీద గుమ్మరించుకోవడం ఎంతో హాయనిపించింది. స్నానం చేసి వస్తుంటే స్నానాలదొడ్డి తలుపుపైన సుప్రజ చీర, లంగా జాకెట్టు కన్పించేయి సందీప్‌కు. చుట్టూ చూశాడు. పెరట్లో ఎవరూ లేరు. అన్నపూర్ణమ్మగారు ఇంటి లోపల ఎక్కడో పనిలో వున్నట్లుంది.

తలుపు దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు. లోపల సుప్రజ స్నానం చేస్తున్న చప్పుడు.

తలుపుకు ఎక్కడన్నా చిన్న కంత వుందేమో? సుప్రజ స్నానం చూడాలని ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. తలుపు క్రిందిభాగం ఖాళీ లోనుంచి చూస్తే ఆ అమ్మాయి పాదాలు మాత్రం కనిపించేయి.

"ఎవరూ?" తలుపు దగ్గర ఎవరో నిలబడ్డట్లు గమనించి గట్టిగా అరిచింది సుప్రజ.

ఇంట్లోకి పరుగెత్తాడు సందీప్.

స్నానం చేసొచ్చి తల చిక్కుతీసుకుంటూ అతని ఎదరుగా నిలబడిందామె. తలెత్తి ఆమెవైపు చూడ్డానిక్కూడ ధైర్యం చాలకపోయింది అతనికి.

"ఇక్కడకొచ్చాక రాత్రిళ్ళు బాగా నిద్రపడుతూ వుంది" ఏదొక విషయం మాట్లాడకపోతే ఏం బావుంటుందని అనేశాడు.

"సోక్రటీస్, లియోనార్డోవిన్సీ, నెపోలియన్– నిద్ర తక్కువపోయేవాళ్ళంట" అందామె.

"అంత గొప్పవాడినేం కాదు" అన్నాడు తను.

"వాళ్ళంతా గొప్పవాళ్ళు కాకపోయినా స్నానాలదొడ్డి దగ్గర గొప్పపనులు చేస్తున్నారుగా' ' చురక తగిలించింది ఆ చిలుకల కొలికి.

సిగ్గుతో తలవంచుకున్నాడు.

"నన్ను నగ్నంగా చూడాలనికదూ మీ కోరిక. రేపు ఇదే సమయానికి స్నానాలదొడ్డి దగ్గరకు రండి. తలుపు గడివెయ్యను. ఎవ్వరూ చూడకుండా లోపలికి వచ్చెయ్యండి. ఇద్దరం కలిసి స్నానం చేద్దాం" అంది సుప్రజ నవ్వుమొహంతో.

సందీప్ మొహం ఒక్కసారి వెయ్యి వోల్టుల బల్బులా వెలిగింది.

మరుసటిరోజు ఉదయం పది గంటలకు పెరట్లో తచ్చట్లాడు సందీప్. స్నానాలదొడ్డి తలుపు మీద సుప్రజ బట్టలు కన్పించేయి. లోపల చేతిగాజుల చప్పుడు. ఉద్రేగంతో ఊగిపోయాడు.

ఆచ్ఛాదనలేని ఆమె శరీరాన్ని చూడాలన్న తపన ఎక్కువైంది.

మెల్లగా తలుపునెట్టి లోపలికి అడుగువేశాడు. లోపలి దృశ్యం చూడలేక కళ్ళు మూసుకున్నాడు ఓ క్షణం.

రొమ్ములవరకూ టవల్ చుట్టుకుని అన్నపూర్ణమ్మ గారు తలరుద్దుకుంటున్నది. ఆమె

తలమీద కుంకుడుకాయ రసం పోస్తున్న సుప్రజ సందీప్‌ను చూసి ఫక్కున నవ్వింది.

కళ్ళల్లో కుంకుడుకాయ రసం పడుతుందేమోనని కళ్ళు గట్టిగా మూసుకుని కూర్చున్న అన్నపూర్ణమ్మగారు ఇదేమీ గమనించలేదు.

"ఏమిటే నవ్వుతున్నావ్... పిచ్చిపట్టిందా" అంది అన్నపూర్ణమ్మ.

"అవును... పిచ్చి ముదిరింది" మళ్ళీ పెద్దగా నవ్వింది సుప్రజ.

బుర్ర గోక్కుంటూ ఇంట్లోకి వచ్చేశాడు సందీప్.

రోజులు సరదాగా గడిచిపోతున్నాయి. పగలంతా సుప్రజను వెంటబెట్టుకుని తోటల్లో తిరగటం, సాయంత్రం చెరువుగట్టుమీద కూర్చుని కబుర్లు చెప్పుకోవడం, అన్నపూర్ణమ్మ గారి చేతివంటలొట్టలు వేసుకుంటూ తినడం, రాత్రిళ్ళు ఆదమరిచి నిద్రపోవడం – జీవితం మధురంగా వుందనుకున్నాడు సందీప్.

పంచదార చిలుక తెచ్చిచ్చింది సందీప్‌కు తినమని. "చెక్క అచ్చుల్లో పంచదార పాకంపోసి తయారు చేసింది అమ్మ. పట్నంలో దొరకదు. బాగా వుంటుంది. చప్పరించండి" అంది సుప్రజ.

"పట్నంలో దొరకని పంచదార చిలుక చేతికి చిక్కందికాని చప్పరించనివ్వడంలేదు' ' అన్నాడు సందీప్ గోముగా. చిలుకల కొలికివైపు ప్రేమగా చూశాడు.

"మూడుముళ్ళుపడితేగాని ఈ పాలపిచ్చుక మీ ఒడిలో వాలదు" అందామె మురిపెంగా అతన్ని చూస్తూ. ఒక్కక్షణం తనను చూడకుండా అతను వుండలేడని తెలుసామెకు.

ఆమెకు దగ్గరగా జరిగాడు. ఆమె కంటిరెప్పలపై తన పెదాలతో మృదువుగా తాకేడు.

గులాబీ రేకులను ముద్దుపెట్టుకున్నట్లుగా అన్పించిందతనికి ఆ క్షణాన.

"ప్రియమైన

అమ్మకి–నాకిక్కడ బాగా నిద్రపడుతూ వుంది. నేనిక్కడే వుండదల్చుకున్నాను. నువ్వూ వచ్చెయ్యి... నీ మేనకోడలు సుప్రజ నిన్ను చూడాలని కలవరిస్తూ వుంది. మా పెళ్ళి చూద్దువుగాని వెంటనే వచ్చెయ్యి.

ఇట్లు,

నీ సందీప్"

తల్లికి ఉత్తరం రాసి పోస్ట్‌బాక్స్‌లో పడేసరికి శరీరం గాల్లో తేలిపోతున్నట్లుగా అన్పించిందతనికి. ✻

**(స్వాతి - 15-4-1994)**